క్లుప్తంగా

పీఆర్కేను కలిసిన వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ సభ్యులు



మాచర్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని సోమవారం పార్టీ హైదరాబాద్ చాప్టర్ ఐటీ వింగ్ అధ్యక్షుడిగా నియమితులైన సింగిరెడ్డి రోషిరెడ్డి, రాష్ట్ర ఐటీ వింగ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి అభినందించారు.

గుండెపోటుతో వీరాపురం వీవోఏ మృతి



సుజాత (ఫైల్)

పిడుగురాళ్ల: మండలంలోని వీరాపురం గ్రామంలో వీవోఏగా పని చేస్తున్న కొడవలూరి సుజాత(48) సోమవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. మృతురాలు గత కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు బంధువులు తెలిపారు. డ్వాక్రా సంఘాల వెలుగు కార్యాలయంలో వీరాపురం వీవోఏగా గత 10 ఏళ్లుగా పని చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని సీసీలు, తోటి వీవోఏలు వీరాపురం గ్రామం విచ్చేసి ఆమె మృతికి సంతాపం తెలిపారు.

మహిళ ఫిర్యాదు.. యువకుడిపై కేసు

సత్తెనపల్లి : మహిళ ఫిర్యాదుతో యువకుడిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో సాయి కృష్ణ థియేటర్ ఎదుట నివసిస్తున్న జిల్లేళ్లమూడి భవాని ఇనుప కొట్టు పెట్టుకొని నివసిస్తోంది. ఈ క్రమంలో ఆమెకు షేక్ కరీం అనే యువకుడితో 2022లో పరిచయమైంది. ఆమె షాపులో గుమాస్తాగా కొంతకాలం పని చేశాడు. తదనంతర పరిణామాలతో ఆమె ఈ ఏడాది ఫిబ్రవరిలో నరసరావుపేట రోడ్డులో ఫుడ్‌కోర్టు పెట్టారు. అతను ఆ షాపులో కొద్ది రోజులు పని చేసి మానేశాడు. అయితే వాళ్లిదరూ ఉన్న ఫొటోలు, వీడియోలు ఇంటర్నెట్‌లో పెడతానని బెదిరిస్తున్నాడని ఆమె ఫిర్యాదు చేసింది. కరీంపై అత్యాచారం, ఐటీ యాక్ట్ కింద పట్టణ సీఐ ఎస్.నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో వినుకొండ విద్యార్థిని ప్రతిభ



వినుకొండ : పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినీ బండారు రవళి జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపినట్లు పాఠశాల హెచ్‌ఎం బి.శైలజ కుమారి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రవళి సెప్టెంబరు 25 నుంచి 28వ తేదీ వరకు తమిళనాడులో జరిగిన జాతీయ పోటీల్లో తృతీయ స్థానం సాధించినట్లు వివరించారు. పాఠశాల ఆవరణలో రవళిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎస్.రూత్‌మేరి, కె.రేణుక, పాఠశాల ఉపాధ్యాయులు భువనేశ్వరి, సీహెచ్. చంద్రశేఖర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన విజయవంతం చేయాలి



శావల్యాపురం: ఉద్యోగ ఉపాధ్యాయ సమస్య పరిష్కరించటంలో ప్రభుత్వ వైఖరిని నిరసన తెలుపుతూ నేడు విజయవాడ ధర్నా చౌక్‌లో జరగనున్న నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని ఫాక్టో నాయకులు సోమ వారం పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో నిరసనకు సంబదించిన కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎస్టీయూ నాయకులు బిళ్ళా రాజారమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలే సరైనా మార్గమన్నారు. పాఠశాల నిర్వహణకు ఇబ్బందు లు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఉపాధ్యాయులు ఐక్యంగా నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, ఫ్యాక్టో నాయకులు కొండ్రముట్ల వెంకటరత్నం, సురేష్, గురుబాబు, బోసు ఉన్నారు.

రూరల్ సీఐగా బ్రహ్మయ్య

వినుకొండ: రూరల్ సీఐగా బ్రహ్మయ్య సోమవారం బాధ్యతలు చేప ట్టారు. గతంలో రూరల్‌సీఐగా పనిచేస్తున్న ప్రభా కర్ బదిలీ కాగా ఆయన స్థానంలో బ్రహ్మయ్య బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన సీఐను ఐనవోలు, శావల్యాపురం, ఎస్ఐలు కృష్ణారావు, లోకేశ్వరరావు, సర్కిల్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి 'స్వచ్ఛ ఆంధ్ర' పురస్కారం

మాచర్ల: మాచర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ప్రతిష్టాత్మకమైన 'స్వచ్ఛ ఆంధ్ర' జిల్లా స్థాయి అవార్డు లభించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యుత్తమ పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించినందుకు గాను మాచర్ల ఆసుపత్రికి ఈ పురస్కారాన్ని అందజేశారు. మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.పి.చారి పారిశుద్ధ్యంపై తీసుకున్న ప్రత్యేక చర్యల ఫలితంగా ఈ అవార్డు వరించింది. సోమవారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో నిర్వహించిన 'స్వచ్ఛ ఆంధ్ర' జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో డాక్టర్ కె.పి.చారి ఈ పురస్కారాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు చేతుల మీదుగా అందుకున్నారు. జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ మాచర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పాటించిన పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై నిర్వహించిన జిల్లా స్థాయి సర్వేలో ఆసుపత్రి అన్ని విధాలుగా ముందంజలో ఉందని గుర్తించి అవార్డు అందించడం జరిగిందని తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది కృషిని ఆమె అభినందించారు.



జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎమ్మెల్యే చదలవాడ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న డాక్టర్ కె.పి.చారి



కలెక్టర్ చేతుల మీదుగా స్వచ్ఛ ఇండస్ట్రీస్ అవార్డు అందుకుంటున్న కేసీపీ జీఎం రమణ

కేసీపీ సంస్థకు 'స్వచ్ఛ ఆంధ్ర' ఇండస్ట్రీస్ అవార్డు

మాచర్లరూరల్: కేసీపీ సిమెంట్స్ ఇండస్ట్రీని పరిశుభ్రంగా ఉంచుతూ కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యం తీసుకుంటున్న చర్యలకు మెచ్చి జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా స్వచ్ఛ ఆంధ్ర ఇండస్ట్రీస్ అవార్డును అందజేశారు. ఈ మేరకు సోమవారం నరసరావుపేటలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా అవార్డును కేసీపీ జీఎం వెంకటరమణ అందుకున్నారు. ఈ సందర్భంగా జీఎం వి.వెంకటరమణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన స్వచ్ఛ ఆంధ్ర ఇండస్ట్రీస్ అవార్డును కేసీపీ సంస్థకు అందజేయటం ఎంతో ఆనందదాయకమని, ఇదే స్ఫూర్తితో మరింత పరిశుభ్రత, భద్రతలను పాటిస్తూ ముందుకు పోతామని తెలిపారు. స్వచ్ఛ ఇండస్ట్రీస్ అవార్డు అందుకున్న సందర్భంగా కార్మిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పీఆర్కేను కలిసిన చలమారెడ్డి, సత్తార్



పీఆర్కేను కలిసిన కొమ్మారెడ్డి చలమారెడ్డి



పఠాన్ సత్తార్‌ను అభినందిస్తున్న పీఆర్కే

మాచర్ల: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన కొమ్మారెడ్డి చలామారెడ్డి సోమవారం పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. చలమారెడ్డిని పీఆర్కే అభినందించారు. మాచర్ల నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా పఠాన్ సత్తార్ ఖాన్ నూతనంగా నియమితులయ్యారు. పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మాచర్ల పట్టణ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం పఠాన్ సత్తార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పఠాన్ సత్తార్‌ను పీఆర్కే సత్కరించారు. పఠాన్ సత్తార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పీఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. మాచర్ల పట్టణం నెహ్రూనగర్ 1వ లైన్‌లో అలవాల శ్రీనివాసరెడ్డి గృహప్రవేశ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అలాగే గన్నవరం గ్రామానికి చెందిన యాంపాటి శ్రీనివాసరెడ్డి కుమారుడు రాజశేఖర్ రెడ్డి వివాహ కార్యక్రమానికి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

కూటమి ప్రభుత్వం పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలి

సీపీఐ, ఎంసీపీఐ నాయకుల డిమాండ్



తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ, ఎంసీపీఐ నాయకులు

మాచర్లరూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరన్నర దాటుతున్నా అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంతోపాటు నిర్మాణం చేపట్టక పోవటం ప్రభుత్వ దివాలా కోరుతనానికి నిదర్శనమని సీపీఐ, ఎంసీపీఐ నాయకులు మిద్దెపోగు బాబురావు, మాచవరపు నాగేశ్వరరావు, కోమటి శివయ్యలు విమర్శించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. ఎన్నికలలో సీట్లు, ఓట్ల కోసం అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలిచ్చి గృహ నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చి సంవత్సరాలు దాటుతున్నా ఇంత వరకూ చర్యలు తీసుకోలేదని, నిరుపేదలందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కొంతమంది నాయకుల పేరుతో కాలనీలను ఏర్పాటు చేసి స్థలాలు అమ్ముకుంటూ పేదల పొట్టకొడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన పేదలను గుర్తించి పట్టణంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇవ్వాలని కోరారు. అలాగే టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అందించాలన్నారు. ఈ సందర్భంగా 450 అర్జీలను తహసీల్దార్‌కు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కందుకూరి కిరణ్, కోటేశ్వరమ్మ, శాంతమ్మ, మేరమ్మ, రామాంజి, కోటేశ్వరరావు, కృష్ణమ్మ, చంద్రమ్మ, చిన్న ఏసు, సుగుణ, చంద్రకళ, గాలెయ్య, నీలమయ్య తదితరులున్నారు.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ సెలెక్షన్స్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ సెలెక్షన్స్ ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహించటం జరుగుతుందని మన్నెం పుల్లారెడ్డి హెచ్‌ఎం కొత్త వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పోటీలు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు నిర్వహించటం జరుగుతుందన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, చెస్, యోగ తదితర అంశాల్లో నిర్వహించటం జరుగుతుందన్నారు. అండర్-14కు విద్యార్థులు 01 జనవరి 2012 తరువాత, అండర్-17 విభాగంలో విద్యార్థులు 01 జనవరి 2009 తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. విద్యార్థులు ఫాం ఏ ని పూర్తి చేసి పాఠశాల హెచ్‌ఎం సంతకంతో రావాలన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా టీషర్ట్, షార్ట్‌లోనే పాల్గొనాలని, ప్యాంట్‌తో ఆడటం కుదరదని తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని కొన్ని ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ బి.పతురాజు తెలిపారు. పట్టణంలోని 11 కేవీ లైన్ మరమ్మతుల దృష్ట్యా మహావీర నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ నుంచి టిడ్కో ఇళ్ల వరకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

నిరసన విజయవంతం చేయాలి

శావల్యాపురం: ఉద్యోగ ఉపాధ్యాయ సమస్య పరిష్కరించటంలో ప్రభుత్వ వైఖరిని నిరసన తెలుపుతూ నేడు విజయవాడ ధర్నా చౌక్‌లో జరగనున్న నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని ఫాక్టో నాయకులు సోమవారం పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో నిరసనకు సంబదించిన కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎస్టీయూ నాయకులు బిళ్ళా రాజారమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలే సరైనా మార్గమన్నారు. పాఠశాల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఉపాధ్యాయులు ఐక్యంగా నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, ఫ్యాక్టో నాయకులు కొండ్రముట్ల వెంకటరత్నం, సురేష్, గురుబాబు, బోసు ఉన్నారు.

నేడు వాల్మీకి మహర్షి జయంతి

సత్తెనపల్లి: రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు పట్టణంలోని వాల్మీకినగర్‌లో ఆయన విగ్రహం వద్ద మంగళవారం ఘనంగా జరుగుతాయని వాల్మీకి బోయ సంఘ బాధ్యుడు ఎద్దులదొడ్డి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భారీ వర్షం.. స్తంభించిన జన జీవనం



దాచేపల్లిలో కురుస్తున్న భారీ వర్షం

దాచేపల్లి: ఉరుములు, మెరుపులు.. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం సోమవారం రాత్రి దంచికొట్టింది. గంటన్నర పాటు విస్తారంగా కురిసిన భారీ వర్షంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. ఉరుములు ఒకవైపు మెరుపులు మరొకవైపు.. ఈదురు గాలులతో భారీ వర్షం కురవడంతో రోడ్లపై వర్షపునీరు ప్రవహించింది. అద్దంకి-నార్కెట్ పల్లి హైవేపై వర్షపు నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షం నేపథ్యంలో ఎక్కడికక్కడే వాగులు పొంగి ప్రవహించాయి. భారీ వర్షంతో వీధులు జలమయమయ్యాయి. ఉరుములు మెరుపులు భీకరమైన గాలుల ధాటికి పలుచోట్ల కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పగిడిపల్లి విజయ్‌కు జాతీయ ప్రతిభ పురస్కారం



విజయ్‌ను సన్మానిస్తున్న మాల మహానాడు నాయకులు

మాచర్ల: మాల మహానాడు ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి విజయ్‌కు జాతీయ ప్రతిభ పురస్కారం రావడం అభినందనీయమని మాల మహానాడు మాచర్ల నియోజకవర్గ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చింతమళ్ల శ్రీనివాసరావు అన్నారు. విజయపురిసౌత్‌లోని మాతాసరోవర్‌లో సోమవారం మాల మహానాడు ఆధ్వర్యంలో పగిడిపల్లి విజయ్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. గత నెలలో హైదరాబాద్ బిర్లా మందిర్‌లో పగిడిపల్లి విజయ్‌కు శ్రీశ్రీ కళావేదిక వారు పత్రికా రంగంలో అందిస్తున్న సేవలకు జాతీయ ప్రతిభ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చింతమళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ సోదరుడు, యువ నాయకుడు పగిడిపల్లి విజయ్ జాతీయ స్థాయిలో ప్రతిభ పుస్కారం అందుకోవడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక మాల మహానాడు పెద్దలు చింతమళ్ల యాకోబు, వైస్ ప్రెసిడెంట్ చింతమళ్ల చెన్నయ్య, పెద్దలు వెంకట నారాయణ, వేముల ఏడుకొండలు, జి. ముచ్చు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, కోశాధికారి రుద్రపాటి ధనుంజయ్, సెక్రటరీ జెక్కి ప్రేమ్ సాగర్, సాతులూరి హరీష్ బాబు, అందె రాంబాబు పలువురున్నారు.

వడ్డే ఓబన్నకు ఘన నివాళి



ఓబన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఓబన్న వర్ధంతి

పిడుగురాళ్ల: పట్టణంలోని సినిమాహాల్ సెంటర్‌లో ఉన్న వడ్డే ఓబన్న విగ్రహం వద్ద ఓబన్న వర్ధంతిని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఓబన్న చేసిన సేవలను ప్రతి వడ్డెర కులస్తులు గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కందులూరి శివయ్య, ఇర్లా గురుస్వామి, ఒర్సు దుర్గారావు, తురకా సత్తిరాజు, గోగుల వెంకటేశ్వర్లు, దేవళ్ల మల్లేశ్వరరావు, కుంచుప గోవిందరాజు, గోగుల లక్ష్మయ్య, ఓర్సు బ్రహ్మం, కొంచెపు వెంకటేశ్వర్లు, బండారు రాజు, ఓర్సు దుర్గాప్రసాద్, బత్తుల వర్ధన్, ఓర్సు అజయ్, ఇర్లా శ్రీనివాసరావు, కందులూరి వెంకటస్వామి, కందులూరి కిరణం, బండారు మహేష్, కందులూరి వెంకటేశ్వరరావు, కొంచెపు తిరపతయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం ఆధ్వర్యంలో...

పిడుగురాళ్ల: పట్టణంలోని సినీమాహాల్ సెంటర్‌లో ఉన్న వడ్డే ఓబన్న విగ్రహం వద్ద వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఓబన్న వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా ఓబన్న కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... వడ్డెర ఓబన్న చేసిన సేవలను ప్రతి ఒక్కరు గుర్తు చేసుకొని ఆయన అడుగు జాడల్లో నడవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, తురక నాగేశ్వరరావు, దేవళ్ల నాగరాజు, శివరాత్రి నారాయణ, చల్ల ఆవులయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, బండారు అంజిబాబు, గోగుల లక్ష్మయ్య, కందులూరి శ్రీను, బత్తుల శివ, బండారు నాగేశ్వరరావు, చల్ల నాగేశ్వరరావు, తిరపతి వెంకటేశ్వర్లు, చల్ల అంకమ్మరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ



విజయపురిసౌత్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు చేసిన 34 మంది విద్యార్థులకు బిగ్ హెల్ప్ సంస్థ తరపున ఉచితంగా మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా బిగ్ హెల్ప్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కోట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్ పరీక్షలో విజయం సాధించేందుకు అవసరమైన శిక్షణ సహాయాన్ని అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిగ్ హెల్ప్ ప్రతినిధులు గ్రామీణ, పట్టణ పేద విద్యార్థులు తమ ప్రతిభను చాటేందుకు అవకాశాలు కల్పించాలని కోరారు. ఎన్ఎంఎంఎస్ వంటి పరీక్షల ద్వారా విద్యార్థులకు దారి తెరవచ్చన్నారు. అందుకే విద్యార్థులకు మెటీరియల్ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.

ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో అభిముఖతను పెంపొందించి, ఉత్తమ భవిష్యత్తు కోసం పునాది వేస్తాయని బిగ్ హెల్ప్ సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది.

విశ్రాంత హెచ్‌ఎం కొమ్మారెడ్డి మృతి



కొమ్మారెడ్డి చిన్నపురెడ్డి(ఫైల్)

రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల విశ్రాంత హెచ్‌ఎం కొమ్మారెడ్డి చిన్నపురెడ్డి(73) సోమవారం మృతి చెందారు. మండల కేంద్రమైన రెంటచింతలకు చెందిన చిన్నపురెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మాష్టార్ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచర్ల మాజీ శాసన సభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇటీవల రెంటచింతలలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. రాయవరం, ఫిరంగిపురం, రెంటచింతల గ్రామాలలో ఉపాధ్యాయుడిగా, కొంతకాలం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా 32 సంవత్సరాల పాటు అంకిత భావంతో పని చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులచే మంచి మాష్టార్‌గా పేరు తెచ్చుకున్నారు. ఆయనకు భార్య సుశీల, ఇద్దరు కుమారులు ఉన్నారు. మాష్టార్ మృతి పట్ల సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రె.ఫాదర్ గోవిందుబాలస్వామి, హెచ్‌ఎం దుర్గాప్రసాద్, విశ్రాంత టీచర్లు తుమ్మా లూర్దుమర్రెడ్డి, డాక్టర్ ఎంబీ చిన్నమ్మ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక కానుకమాత చర్చిలో ప్రత్యేక పూజాబలిని సమర్పించి అనంతరం భూ స్థాపితం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

'సత్తెనపల్లి'కి నాలుగు స్వచ్ఛాంధ్ర అవార్డులు



స్వచ్ఛాంధ్ర పురస్కారాన్ని అందుకుంటున్న భట్లూరు పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: ప్రభుత్వం స్వచ్ఛత కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ తొలిసారి ప్రకటించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు -2025లో సత్తెనపల్లి మండలానికి నాలుగు అవార్డులు దక్కినట్లు ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల పేరుతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా అవార్డులను ప్రకటిస్తోందని, అదే బాటలో స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం చేస్తున్నారన్నారు. జిల్లా స్థాయిలో 16 విభాగాల్లో 51 మంది వ్యక్తులు, సంస్థలు అవార్డులు దక్కించుకోగా వాటిలో నాలుగు పురస్కారాలు సత్తెనపల్లి మండలానికి దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అవార్డు గ్రహీతలకు కలెక్టర్ కృతికా శుక్లా, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు సోమవారం పురస్కారాలు అందజేశారన్నారు. సత్తెనపల్లి మండలానికి సంబంధించి స్వచ్ఛ గ్రామ పంచాయతీల విభాగంలో భట్లూరు, గుడిపూడి, నందిగామలకు పురస్కారాలు దక్కాయన్నారు. భట్లూరు సర్పంచ్ ఈదర రామారావు, గుడిపూడి సర్పంచ్ తౌరటి తిరుపతయ్య, నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, భట్లూరు పంచాయతీ కార్యదర్శి చెల్లంచర్ల శ్రీనివాసరావు, నందిగామ పంచాయతీ కార్యదర్శులు కుంభా వెంకటేశ్వర్లు, చిలువూరు కృష్ణప్రసాద్‌లు ఈ పురస్కారాలు అందుకున్నారన్నారు. ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్ విభాగంలో నందిగామలో పనిచేస్తున్న హరితరాయబారి గరికపాటి మరియమ్మకు పురస్కారం వరించిందన్నారు.

క్రోసూరు ఆదర్శ పాఠశాలకు జిల్లా స్థాయి అవార్డ్

క్రోసూరు: స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పురస్కారాల్లో భాగంగా పాఠశాలల విభాగంలో క్రోసూరు ఆదర్శ పాఠశాలకు జిల్లా స్థాయిలో స్వచ్ఛ పాఠశాల అవార్డు లభించినట్లు ఆ పాఠశాల ప్రిన్స్‌పాల్ మేరీసూజన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరసరావుపేట టౌన్‌హాల్లో కలెక్టర్ కృతికా శుక్లా నుంచి అవార్డు అందుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఐదు పాఠశాలలకు అవార్డులు రాగా అందులో క్రోసూరు ఆదర్శ పాఠశాల ఒకటని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ ఎల్.చంద్రకళ, ఎంఈఓ గణేష్, ఎంపీడీవో రవికుమార్, డెప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

• ఎండైనా.. వానైనా.. నిలువ నీడ లేదు!



దాచేపల్లి పాతబస్టాండ్ సెంటర్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఎండైనా.. వానైనా.. ప్రయాణికులకు నిలువ నీడ లేకుండా పోయింది. దాచేపల్లి పాత బస్టాండ్ సెంటర్ నుంచి గుంటూరు, మాచర్ల, పిడుగురాళ్ల ప్రాంతాలకు నిత్యం అనేక మంది బస్సుల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి రోజు వేల సంఖ్యలో ఇక్కడ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు బస్సుల కోసం ఎండలో నిలబడాల్సిన పరిస్థితి ఉంది. ఎండలో నిలబడలేక.. అలాగే వర్షం వస్తే తడుస్తూ నిలబడేందుకు షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల కోసం షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

– దాచేపల్లి

ప్రతి పాఠశాలలో భూసార పరీక్షలు చేయండి



నకరికల్లు: ప్రతి పాఠశాల పరిధిలో 50కి పైగా మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయాలని భూసార పరీక్షాకేంద్రం వ్యవసాయాధికారి పి.యాకోబు సూచించారు. భూసార పరీక్షల ప్రయోజనాలు వివరిస్తూ దేచవరం ఆదర్శపాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలాకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తే ఖర్చు తగ్గడంతో పాటు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు సాధించవచ్చన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందులు లేని వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.వేళాంగిణి మేరీ, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, డీఆర్‌సీ ఏఓ ఎం.అరుణ, ఏఈఓ పి.విజయదుర్గ, వీపీఏ పి.పవన్‌కుమార్, ఉపాధ్యాయినిలు కె.శ్యామల, ఎం.రూతు, విద్యార్థులు పాల్గొన్నారు.